

# అనధికార దర్పం

వాడ్రేవు రాధికా సావిత్రి



పెళ్ళి, వెంటనే ట్రాన్స్‌ఫర్, అంతా ఒకదానివెంట ఒకటి జరిగిపోయాయి. ఈఊరు ఈసమాజం నాకు చాలా కొత్తగాను, చికాగ్గాను ఉంది. వచ్చినప్పటి నుంచి పార్టీల పరిచయాల పేరుతో తిరగాల్సి, తిరుగుతూనే ఉన్నాను. వీటి నుండి నేనెంత తప్పించుకోవాలన్నా సాధ్యం కావటం లేదు. ఈమనుష్యుల్నించి ఎలాగైనా దూరంగా ఉండాలి. ఈ ఆఫీసర్ల భార్యలు, ముఖ్యంగా ఈ'మేడం'ని చూస్తే చికాకు, జాలి, రెండూ కలుగుతున్నాయి.

"ఏంటి ఆలోచిస్తున్నావ్" అన్న ఆయన మాటతో ఆలోచనలు కట్టిపెట్టి స్నానం చేయడానికి వెళ్ళేను. బయట పెరట్లో వెన్నెల పుచ్చపువ్వులా ఉంది. చిన్నగా చలి. ఎర్రగా మండుతున్న పొయ్యి మీద కుండలో సలసల కాగుతున్న నీళ్ళు చూసేసరికి ఎక్కడలేని ఉత్సాహం వచ్చింది. నేను స్నానం చేసి వచ్చేసరికి ఆయన భోజనానికి అన్నీ సర్దుతున్నారు. పెరట్లో వంటింటి గోడకి ఎటాచ్డ్‌గా రేకు దింపిన చిన్న అరుగు. ప్రక్కనే దాని గోడకు అల్లుకున్న భోగన్ విలియాలోంచి వెన్నెల ముగ్గులు ముగ్గులుగా పడుతోంది. ఒక ప్రక్కగా వంగ, టమాటా, కాలీఫ్లవర్ మరొకవైపంతా మల్లెలు, రంగు రంగుల గులాబీలు. ఇక్కడ కూర్చుంటే వనం మధ్యలో కూర్చున్నట్టే ఉంటుంది. అందుకే ఈ అరుగుని మాభోజన శాలగా మార్చేసుకున్నాం.

"మళ్ళీ ఆలోచనా! భోంచేద్దామా" అంటున్నారు. ఎందుకో ప్రొద్దుట నుంచి చికాగ్గాను, చాలా డల్‌గాను ఉంది. భోజనం చేసి వచ్చి పడుకున్నాను. ఆయన నన్ను ఇంకేమీ మాట్లాడించలేదు. చిన్నగా హేమంత్ కుమార్ కాసెట్టు పెట్టి పడుకున్నారు.

నిద్ర రావటం లేదు. హేమంత్ కుమార్ అద్భుతంగా పాడుతున్నాడు. ఎందుకు నేనింత సినికల్‌గా తయారవుతున్నాను? ఈ సమాజాన్ని ఎందుకు భరించలేక పోతున్నాను.

పెళ్ళి అయిన వెంటనే ఇక్కడికి వచ్చేయడం వల్ల అంతా కొత్తగాను భయంగాను అనిపించింది. ఈయన్ని ఈ ప్రాజెక్టుకి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా ట్రాన్స్‌ఫర్ చేసేరు. ఇద్దరికీ ఒకరికొకరం కొత్త. పైగా కొత్త ప్రాంతం. అయితే ఇక్కడ సబ్‌కలెక్టర్‌గా పనిచేస్తున్న వెంకటేష్‌గారు ఈయనకి బి.టెక్‌లో క్లాస్‌మేట్. అందువల్ల కొద్దిగా ధైర్యంగానే అనిపించింది. ఆరోజు వస్తూనే మొట్టమొదటగా వాళ్ళనే కలిసాం. ఆయన చాలా జంటిల్మన్. చాలా బాగా మాట్లాడేరు. ఆయన భార్యపేరు సుజాత. ఆమె చాలా హడావుడి చేసింది. ఊరు గురించి, ఇక్కడి విషయాల గురించి చాలాసేపు మాట్లాడేరు. ఇక్కడ ఒక రిక్రియేషన్ క్లబ్ ఉందని, అలాగే లేడీస్ అంతా కలసి రోజూ ఒక సెంటర్‌లో కలుస్తారని, అందరూ చాలా ఏక్టివ్ అని, ఇక్కడ చాలాబావుంటుందని చెప్పింది. ఇంత వరకు మెడిసన్ చదువు, హౌస్‌సర్జన్సీ అవుతుండగానే పెళ్ళి. అందువల్ల ఒక్కర్తినీ ఉండాలంటే బెంగగా అనిపించినా ఈమెని చూసేక చాలా ధైర్యంగా అనిపించింది.


మర్నాడు మాకు కొత్తగా పెళ్ళి అయి వచ్చినందుకు గాను ప్రాజెక్టు ఉద్యోగి బృందం అంతా కలసి క్లబ్‌లో పార్టీ ఏర్పాటు చేసేరు. ఆరోజు పార్టీలో హడావుడంతా సుజాతగారిదే. నన్ను అందరి ఉద్యోగస్థుల భార్యలకీ పరిచయం చేసింది. మొట్టమొద

టగా సినియర్ ఇంజనీర్ భార్యకి చూపించి పరిచయం చేసింది. ఆమె పెద్దామె. చాలా హుందాగా ఉన్నారు. ఈయన కాక ఇంకా నలుగురు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఉన్నారు. వాళ్ళ భార్యలను చూపించి వీళ్ళు మీ కోలీగ్స్ అంటూ పరిచయం చేసింది. కోలీగ్స్ అంటే అర్థం కాలేదు. నాకు తరువాత తెలిసింది వాళ్ళ భర్తలు, ఈయన సమానమైన ఉద్యోగం అవడం వల్ల మేమంతా కోలీగ్స్ అయ్యామని. అటు వంటి రిలేషన్ మొట్టమొదటగా నేను వినడం అదే. ఆతరువాత అసిస్టెంట్ ఇంజనీర్స్, వర్క్ ఇన్స్‌పెక్టర్‌లు, క్లర్క్‌లు వాళ్ళందరి భార్యలని పరిచయం చేసింది. అందులో ఒక వర్క్ ఇన్స్‌పెక్టర్ భార్య ఆమె క్లాస్‌మేట్‌ట. ఆమెపేరు మెర్సీ. ఈ పరిచయాలయిన తరువాత మొదటసారిగా నాకు తెలిసిందేమంటే ఉద్యోగస్తుల మధ్య ఉండే హైరార్కీ ఇక్కడ వీళ్ళ భార్యల మధ్య కూడా ఉంది. వీళ్ళందరికీ 'మేడం' సుజాత. అందరూ ఈమెని మేడం అని పిలుస్తారు. ఎందుకంటే ఈమె భర్త ఐ.ఎ.ఎస్. అనే క్వాలిఫికేషన్ కలిగి ఉండటం. అందువల్ల ఇప్పుడు నేను కూడా ఆమెకి సబార్డినేట్‌ని.

పార్టీ నుంచి ఇంటికి రాగానే ఆయనతో అన్నీ చెప్పేను. ఆయన నవ్వి "నీకిదంతా కొత్త కదా అలాగే ఉంటుంది" అన్నారు. "అంటే మీరు దీన్ని ఏక్సెప్ట్ చేస్తున్నారా" అన్నాను. ఆయన నవ్వి "మనం చేసేదే ముంది మనమిటువంటి వ్యవస్థలో ఉన్నాం" అన్నారు. కాని నేను మాత్రం దీన్ని అంగీకరించకూడదని నిశ్చయించుకున్నాను.

మర్నాడు ఇల్లంతా సర్దేం. చుట్టూ తోట వేయడానికి అంతా ప్లాన్ చేసుకుంటున్నాం. ఈలోపున ఎదురింట్లో ఉండే హేమ వచ్చింది. ఎల్.కె.జి. చదువుతోంది. చాలా ముద్దుగా ఉంది. మొక్కలు వేస్తారా ఆంటీ గులాబీలు పూస్తే నాకివ్వాలి అంటూ చాలా మాటలు మాట్లాడింది. ఎందుకో ఆ అమ్మాయితో మాట్లాడుతుంటే ఎంతో ఉత్సాహంగాను, ఆనందంగాను అనిపించింది.

మధ్యాహ్నం అవుతుండగా జీప్సీలో



మేడం ఇంటికి వచ్చింది. ఆమె కూడా ఇద్దరు భట్రాజులు. ఇల్లంతా బాగానే సర్దేరే అంటూ అంతా తిరిగి చూసింది. నేను టీ పెడతానని చెప్పి వంటింట్లోకి వెళ్ళేను. అంతే ఆమె ఆశ్చర్యపోతూ కుక్ ఏమయ్యాడు అంది. కుక్ ఎందుకు అన్నాను. మరి వంట ఎవరు చేస్తారు అంది. మన వంట మనం చేసుకోవడానికి కుక్ ఎందుకు అన్నాను. వెంటనే తడబడి అవునండీ నాకూ వాళ్ళ చేత చేయించడం ఇష్టం ఉండదు. కాని ఇంతింత జీతాలిస్తున్నదెందుకు! అందుకే నేను దగ్గరే ఉండి చేయిస్తాను అంది. వాళ్ళకి జీతాలు మనమివ్వటం లేదుకదా అందామని ఊరుకున్నాను.

అప్పుడే మొక్కలు కూడా వేసేరే? అంటూ ఎంత మంది అటెండర్లని పెట్టుకున్నారు అంది. ఎవ్వరినీ పెట్టుకోలేదు. గిన్నెలు కడగడానికి వందరూపాయలకి ఎవరినైనా అమ్మాయిని పెట్టుకుందామనుకుంటున్నాం అన్నాను.

ఇంతలో టైమ్ చూసుకుని చాలా పనులున్నాయి నేను వెళ్లాలి. అంటూ రేపు సెంటర్‌కి రండి అని చెప్పి వెళ్ళిపోయింది.

సెంటర్ అంటే ఏమిటో చూడాలన్న కుతూహలం ఉంది కాని వెళ్ళాలనిపించ లేదు. ఇంతలో మేడం రమ్మంటున్నారంటూ కబురు. ఎదురింట్లో ఆమె కూడా రండి వెళ్దాం అంటూ వచ్చింది. ఇంక తప్పింది కాదు.

అది ఒక చిన్న హాలు. ఆరు కుట్లు మిషన్‌లు, మూడు ఎంబ్రాయిడరీ మిషన్‌లు ఉన్నాయి. మధ్యలో మేడం కుర్చీలో కూర్చుని నైటీకి డిజైన్ కుడుతోంది చుట్టూ బెంచీల మీద కాలనీ ఆడవాళ్ళంతా నన్ను చూస్తూనే నవ్వి ఎదురుగా బెంచీమీద సీటు చూపించింది. ఒక్కసారిగా నాకదంతా ఒక ఆఫీసురూమ్‌లాగ అనిపించింది.

మొత్తానికి ఆరోజు వాళ్ళందరి చర్చనీయాంశాలు అక్కడికి రానివాళ్ళనుగురించే. అవి ఎంత పనికిమాలిన కబుర్లో. దీనికి కారణం వీళ్ళకి ఇళ్ళలో ఎవరికీ పనిలేకపోవడం. ఇంట్లో పనంతా అటెండర్లు చేస్తారు. వీళ్ళకి ఏ ఇంట్రస్టులూ లేవు. అందర్నీ గురించి విమర్శించడం తప్ప. నాకు చాలా చికాగ్గా అనిపించింది. మళ్ళీ ఛాయలకి పోకూడదని నిశ్చయించుకున్నాను.

రోజూ ఎవ్వరో ఒకరు ఇంటికి రావడం. గంటలు గంటలు నా టైమ్ తినేయడం. వాళ్ళతో ఏం మాట్లాడాలో తెలియదు. నేను మాట్లాడే ఏ-టాపిక్ వాళ్ళకి ఇంట్రస్టుగా ఉండదు. అందుకే హేమే నాకు మంచి ఫ్రెండ్. రోజూ తన కాన్వెంట్ కబుర్లన్నీ చెపుతుంది. నేను చెప్పేవన్నీ చక్కగా వింటుంది. ఆ అమ్మాయి కోసం కొత్తకొత్త చందమామ కథలు చదవాలనిపిస్తుంది.

ఒకరోజు మేడంకి ఒంట్లో బాగాలేదట. ఆమె చూడ్డానికి కాలనీ వాళ్ళంతా బయలుదేరేరు. ఎదురింట్లో ఆమె నన్ను కూడా రమ్మని పిలిచి వెళ్ళడానికి జీప్ తెచ్చింది. జీప్ ఎందుకు దగ్గరే కదా అంటే అదేంటి నడిచి ఎలా వెళ్తాం అంది. కొద్ది దూరం వెళ్ళేక ఒక క్వార్టర్ ముందు జీప్ ఆగింది. ఆ ఇంట్లో ఆమె ఈమెకి ఫ్రెండట. ఆమె క్లర్క్ భార్య ఆవిడ కూడా వస్తోంది. ఆవిడ జీప్‌లో వెనకాల ఎక్కింది. అదేంటి మనముగ్గురికీ ముందు సరిపోతుంది కదా వచ్చేయండి అంటే ఆమె రాలేదు. ఆ తరువాత తెలిసింది. ఆమె ఈమెకి సబార్డినేట్ అని. అంటే చిన్న ఉద్యోగస్థుని భార్య అయినందువల్ల ఆమె వెనక కూర్చుందని. ఇది విన్నాక నాకెంత అసహ్యం వేసిందో చెప్పలేను.

మర్నాడు మేడం వాళ్ళింటికి రమ్మని

రీతిక శీర్షిక యువతకై ప్రత్యేకించిన శీర్షిక. యువకవులు, కథకులు అనేకమంది తమ కథలను, కవితలను 'ఆహ్వానం' పత్రికకు పంపుతున్నారు. వీరిని ప్రోత్సాహించేందుకై రీతిక శీర్షికలో క్రొత్త కవులకు, కథకులకు కొన్ని పేజీలు కేటాయిస్తున్నాం. ఈ అవకాశాన్ని వినియోగించుకోదలచిన యువతరం తమ కథలను, కవితలను సామాజిక అవగాహన కొరవడకుండా సంక్షిప్తంగా రాసి పంపితే ప్రచురిస్తాం. —ఎడిటర్

ఒకటే బలవంత పెట్టి ఫోన్లు చేస్తే వెళ్ళేను. నన్ను చూస్తూనే ఏంటండీ అన్ని సార్లు పిలిపించుకుంటారు అంది. నాకు చాలా మొహమాటంగా అనిపించింది అలామాట్లాడితే.

ఈ మధ్య తను చేసిన ఘనకార్యాలన్నీ చెప్తోంది. తను ఏయే మీటింగ్స్‌కి అటెండ్ అయ్యింది, ఎన్నెన్ని తనని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నా వాటన్నింటినీ తను ఎలా ఎడ్జస్ట్ చేస్తున్నది చెప్తోంది. అసలు ఈ రోజు ఇక్కడికి రావడానికి కారణం ఎలాగైనా ఈమెతో సీరియస్‌గా మాట్లాడాలని నిశ్చయించుకోవటమే.

ఇదంతా రిమోట్ ఏరియాకదా. మనందరికి ఇళ్ళలో చాలా టైమ్ ఉంటుంది. మనందరం కొద్దో గొప్పో చదువుకున్న వాళ్ళం. మనమంతా కలిసి ఏవైనా మంచి పనులు చెయ్యొచ్చు. అందరికీ వెహికిల్స్ ఉన్నాయి. వాటిని మన సొంత పనులకోసం అన్నన్ని సార్లు తిప్పుతున్నాం. అలాంటప్పుడు మనందరం కలిసి ఏదైనా ఒక వెహికిల్ తీసుకొని ఈ చుట్టు ప్రక్కల పల్లె ప్రాంతాలకి వెళ్ళి వైద్యం చేయడం, వాళ్ళకి ఆరోగ్యం పట్ల, చదువు పట్ల అవగాహన కలిగిద్దాం. అలాగే కుట్టు సెంటర్ వంకతో పనికిమాలిన కబుర్లు చెప్పుకోవటం కన్న, నిశ్శబ్దంగా ఎవరంతట వారు చదువుకొనే లైబ్రరీ ఏర్పాటు చేసుకుంటే బావుంటుందని ఇలా చాలా మాట్లాడాలని ఊహించుకొని వెళ్ళేను. ఆమె మాట్లాడుతుండగా ఫోన్ వచ్చింది. ఫోన్ పెట్టేస్తూ రంగా అంటూ గట్టిగా పిల్చింది. అతడు భయం భయంగా వచ్చేడు. ఏరా! మెర్సీ అమ్మ నేను లేనప్పుడు వచ్చేరుట కదా. చెప్పడం మర్చిపోతావా! ఈడ్చి తంతే ఊరవతల పడతావు. ఒళ్ళు బాగా బలిసిందిరా స్టుపిడ్. ఆరునెలలు సస్పెండ్ చేస్తే బుద్దొస్తుంది అని తిడుతోంది.

ఈ లోపున వాళ్ళ అబ్బాయి లోపల్నించి వస్తూ ఈ స్టుపిడ్ నా బుడగలన్నీ ఊదమంటే పేలగొట్టేసేడు అంటున్నాడు. ఆమె చెప్తోంది. మెర్సీ నాకు క్లాస్‌మేట్ తనని చూస్తే జాలి నాకు జాలి కలుగుతుంది. నేనీ స్టేజ్‌లో ఉండడం. తనా స్టేజ్‌లో ఉండడం అంటోంది. నాకింక ఒక్క క్షణం ఉండబుద్ధి కాలేదు. వెళతానని చెప్పి వచ్చేసేను. అసలు ముందు ఈమెనే సంస్కరించాలనిపించింది.

ఈ రోజుకి కూడా మనుషుల్ని ఇంత బానిసలుగా అదీ సొంత బానిసలుగా చూడడం చూస్తే ఒక్కసారిగా ఆమె మీద కంటె ఆమెకి అటువంటి అధికారాన్ని కల్పించిన వ్యవస్థ మీద ఎంత అసహ్యం కలిగిందో ఎలా చెప్పను.

అసలు ఎలాగైనా ఈమె నుండి దూరంగా ఉండాలి. వెంకటేష్‌గారికి తనకి మధ్య ఎటువంటి తేడా ఉండదు. ఇద్దరూ సమానంగానే భావించుకుంటారు. కాని ఈ మేడంకి మాత్రం నేను సబార్డినేట్‌ని మేమిద్దరం ఏ ఉద్యోగం చేయకపోయినా. వీళ్ళు కూడా ఆఫీసర్లలా భావించుకుని పెత్తనం చెలాయిస్తారు. ఎంత ఫాల్స్ ప్రెస్టేజ్. మళ్ళీ భర్తలు ఈ ఉద్యోగం నుంచి తప్పుకున్న మరుక్షణం వీళ్ళకి సలాములు చేసినవాళ్ళు కన్నెత్తయినా చూడరు. అసలు ఎవరికి వాళ్ళకి స్వతంత్రంగా వాళ్ళంతట వాళ్ళు ఒక వ్యక్తిగా గౌరవం, విలువ, అధికారం సంపాదించుకోవాలి. కాని ఇలా భార్యలుగా పొందాలనుకోవడం ఎంత తెలివి తక్కువ. అసలు మనుషుల మధ్య తేడా ఎందుకుండాలి. ఇది కేవలం బాధ్యతల మధ్య చిన్న పెద్ద తేడా మాత్రమే.

రేపు హేమ పుట్టినరోజు. పార్టీ ఎరేంజ్ చేసేరట. నేను వెళ్ళకపోతే తను బాధపడుతుంది. నాకు కూడా వెళ్ళాలనే ఉంది. కాని కొన్ని రోజులుగా ఈ మనుషులని చాలా కష్టంతో ఎవాయిడ్ చేస్తున్నాను. రేపు మళ్ళీ వీళ్ళందరినీ పార్టీలో కలవాలంటే చాలా చికాగ్గా వుంది. ఆలస్యంగా వెళితే సరిపోతుంది అనుకున్నాను. "చాలా టైమ్ అయ్యింది ఇంక పడుకోవా" అంటూ ఆయన పిలిచేటప్పటికి ఇంక ఆలోచనలు కట్టిపెట్టి పడుకున్నాను.

ప్రొద్దుటే పేపర్ చదువుతుంటే హేమ వచ్చింది. చిలకాకు పచ్చ ఫ్రాక్‌లో చాలా ముద్దుగా అందంగా ఉంది. హేపీ బర్త్‌డే అని చెప్పి తోటలో గులాబి ఒకటి కోసి తల్లో పెట్టేను. ఆంటీ సాయంత్రం పార్టీకి తప్పకుండా రావాలి అని చెప్పి వెళ్ళిపోయింది.

పార్టీకి ఆలస్యంగానే బయలుదేరేను. కరెంట్ పోయింది కదా అందువల్ల లేట్ అయ్యిందని సాకు చెప్పవచ్చనుకుంటూ.

నేను వెళ్ళేసరికి అందరూ అక్కడే ఉన్నారు. మొదలు పెట్టడమే లేట్ అయ్యిందిట. ఈలోపు కరెంట్ కూడా పోయిందని కరెంట్ వచ్చేదాకా ఆగేరుట. పార్టీ మధ్య రూమ్‌లో ఏర్పాటు చేసేరు. ఎదురుగా టీపాయ్‌మీద కేక్, క్రొవ్వొత్తులు. దాని ఎదురుగా హేమ వాళ్ళ అమ్మ, నాన్న. అటూ ఇటూ కుర్చీలలో మేడం, కొద్ది మంది పెద్ద ఉద్యోగస్తుల భార్యలు. క్రింద కార్పెట్ మీద మిగిలిన కాలనీ ఆడవాళ్ళంతా. నన్ను చూసి మేడం "తమరి దర్శనమే కరువయ్యిందే" అని వ్యంగ్యంగా అంటూ తన కుర్చీకి దగ్గరలో కార్పెట్ మీద కొద్దిగా స్థలం చూపించింది కూర్చోమని. అసలు నాకు ఆ ఏర్పాటు చూస్తేనే చాలా చిరాగ్గా ఉంది. వద్దని చెప్పి హేమావాళ్ళ తోట చూడ్డానికి పెరట్లోకి వెళ్ళేను.

హడావడంతా తగ్గేక లోపలికి వచ్చేను. అందరూ ప్రజంటేషన్స్ ఇస్తున్నారు. ఒక చిన్న పిల్ల బర్త్‌డేకి ఇంతింత ఖరీదైన ప్రజంటేషన్స్ ఇవ్వడం చూస్తే చాలా ఆశ్చర్యం వేసింది. నేను ఇంట్లో పూలతో ఒక బొకే తయారు చేసి తెచ్చేను. అది చూసి హేమ ఎంత ఆనంద పడిందో చెప్పలేను.

నేను బొకే ఇవ్వడం చూస్తూనే మేడం, "రంగా జీప్సీలో బొకేలున్నాయి పట్టుకురా" అని పిల్చింది. అతడు భయం భయంగా బెదురు చూపులతో గాజు బౌల్‌లో నాలుగు బొకేలు పట్టుకొచ్చేడు. ఆమె రంగా అని పిలుస్తూనే నాకు చాలా టెన్షన్‌గా అనిపించింది. అందరి ముందు అతన్ని స్టుపిడ్ అనదు కదా! అనకుండా ఉంటే బావుండును అనుకున్నాను. నిజంగా బొకేలు చాలా అద్భుతంగా ఉన్నాయి. అంత అందమైన బొకేలు కట్టిచ్చినందుకు ఆమెమీద నాకు అసూయ కలిగింది. "బొకేలు చాలా బావున్నాయండి అన్నాను ఆమెతో. అదేనండి నేను ఏదిచ్చినా స్పెషల్‌గా గ్రాండ్‌గా ఉండాలనుకుంటాను. ఇంకా కొన్ని కడదామనుకున్నాను కాని టైమ్ ఎక్కడ!

ఆమెతో వెళ్ళొస్తానని చెప్పి హేమా వాళ్ళ అమ్మకి కూడా చెప్పి వస్తుంటే హేమ- మేడం వాళ్ళమ్మాయి భావనతో అంటోంది. "ఈ పూలగుత్తులు ఎంతబావున్నాయో" అని. " అవును అవి మా రంగా కట్టేడు. ప్రతి న్యూఇయర్ డేకి ఎన్ని బొకేలు కడతాడో తెలుసా! ఇంకా రంగు రంగులవి చాలా అందంగా కడతాడు" అంటోంది భావన. నాకు ఒక్కసారిగా ఆ మాటలు విని చాలా ఆశ్చర్యం కలిగింది. పాపం ఆ పసి హృదయానికి ఏం తెలుసు. అవి వాళ్ళమ్మే కట్టిందని చెప్పాలని. కాని ఈ బ్యూరోక్రేటిక్ సమాజ ప్రభావానికి లోనవుతున్న ఈ పసి హృదయం రేపు మరొక "మేడం" అవుతోంది.